పాములుంటాయ్.. జాగ్రత్త



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడి పేరు తేజేశ్వర్ రెడ్డి. కనగానపల్లి మండలం కుర్లపల్లి గ్రామం. 15 రోజుల క్రితం పశువుల కొట్టంలో పని చేస్తుండగా చెత్త కింద ఉన్న పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు తేజేశ్వర్ రెడ్డిని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఆ యువకుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

- కలుగుల్లో నుంచి బయటకు వస్తున్న పాములు
- ఏమరపాటుగా ఉంటే ప్రాణాలకే ముప్పు
- పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదాలు
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు అవసరం

ధర్మవరం రూరల్: ప్రస్తుతం అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. ఎండ వేడిమికి చెట్ల పొదల్లో, బొరియల్లో దాగి ఉన్న పాములు ఉక్కపోతకు తాళలేక బయటకు వస్తున్నాయి. అటవీ సరిహద్దు గ్రామాల్లో పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండకపోతే అంతే సంగతులు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పాము కాటుకు గురికాక తప్పదు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అధిగమించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాలు ప్రారంభం అయినప్పటి నుంచి సెప్టెంబర్ వరకు పాములు, ఇతర విష కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పాములు ఎలుకలు, కప్పలను తినేందుకు బయట తిరుగుతూ చెట్ల పొదల్లో ఉంటాయి. పొలాల్లో కంది కొయ్యల కింద పాములు దాగి ఉంటాయి. చెద పురుగులను తినడం కోసం వాటి కింద చేరుతాయి. ముఖ్యంగా పాము కాటేస్తే ఒంటిపై రెండు లేదా నాలుగు కామా ఆకారపు గుర్తులు పడతాయి. అరగంట లోపు విషం ఒళ్లంతా పాకి నాడి వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. కళ్లు మూతలు పడటం, చేతులు, కాళ్లకు తాత్కాలికంగా పక్షపాతం రావడం, మాట ఆగిపోవడం, నాలుకకు రుచి తెలియకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్త పింజరి కరిచిన భాగం ఉబ్బి తీవ్రంగా నొప్పి కలిగిస్తుంది. అర గంటలో నోరు, చెవుల్లో నుంచి రక్తస్రావం జరుగుతుంది. పాము కాటు వేసిన భాగాన్ని ఎక్కువగా కదిలించరాదు. ఆ భాగాన్ని బట్టతో లేదా టవల్‌తో గట్టిగా కట్టాలి. ఇలా చేయడం వల్ల విషం శరీరంలోకి వ్యాపించదు. కట్టును పది నిమిషాలకు ఒకసారి వదిలి మళ్లీ కడుతూ ఉండాలి. పాము కాటు వేసిన చోట కొత్త బ్లేడుతో ప్లస్ గుర్తు మాదిరి ఒక సెంటీమీటర్ లోపలి వరకు కోయాలి. కాసేపటికి విషంతో కూడిన రక్తం దానంతట అదే బయటకు వస్తుంది. సాధ్యమైనంత తొందరగా సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లితే విషానికి యాంటీ వీనమ్ (విరుగుడు మందు) తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు. రాత్రి వేళల్లో పొలం వద్దకు వెళ్లే రైతులు శబ్దం చేస్తూ టార్చిలైట్ వెలుతురులో వెళ్లాలి.

పాము కాటుతో పాడి ఆవు మృతి



పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం తగరువాళ్లపల్లి గ్రామంలో రైతు అప్పిరెడ్డికి చెందిన పాడి ఆవు పాముకాటుతో మృతి చెందింది. రైతు అప్పిరెడ్డి తెలిపిన వివరాలు.. సోమవారం సాయంత్రం పాలు పితికిన అనంతరం ఆవుకు మేత వేసి వచ్చి ఇంటి వద్ద పడుకున్నాడు. మంగళవారం ఉదయం ఆవు వద్దకు వెళ్లిన కొద్ది నిమిషాలకు మృతి చెందింది. ఆవును పరిశీలించిన వైద్యులు పాము కాటుకు గురైందని నిర్ధారించారు. రూ.లక్ష ఖర్చు పెట్టి పాడి ఆవు కొనుగోలు చేశానని రైతు చెబుతున్నాడు.



ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో 8 కేసులు

ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లోని తాడిమర్రి, ముదిగుబ్బ, ధర్మవరం రూరల్, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన 8 మంది ఇటీవల పాము కాటుకు గురైనట్లు వైద్యులు, 108 సిబ్బంది చెబుతున్నారు. వీరంతా పాము కాటు వేసిన వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రి, బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

- పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకూడదు. తీవ్రమైన ఒత్తిడికి గురైతే గుండె పోటు వచ్చే ప్రమాదం ఉంది.
- పాము కాటు వేయగానే గాయాలు పైభాగంలో కట్టు కట్టాలి. దీని వల్ల విషం శరీరానికి పాకకుండా నివారించవచ్చు.
- ఏ పాము కాటు వేసిందో తెలుసుకుని యాంటీవీనమ్ (విషానికి విరుగుడు) తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చు.
- రైతులు రాత్రి పూట పొలాలకు వెళ్లేటప్పుడు కాళ్లకు చెప్పులు, టార్చిలైట్లతో పాటు శబ్దాలు చేసే పరికరాన్ని వెంట తీసుకుని వెళ్తే మేలు.

అన్ని పాములు ప్రమాదం కాదు

మనకు కనిపించే అన్ని పాములు విష పూరితం కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. నాగు పాము, కట్ల పాము, రక్త పింజరి వంటి పాముల వల్లే ప్రమాదం ఉంది. పాము కాటేసిన వెంటనే వైద్యం చేయించుకుంటే ఎలాంటి సమస్య ఉండదు.

అందుబాటులో మందులు



దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాము కాటుకు మందులు ఉన్నాయి. రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనులు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. పాము కాటుకు గురైతే వెంటనే స్థానిక ఆసుపత్రులకు తీసుకెళ్లాలి. ఎటువంటి పరిస్థితుల్లో కూడా నాటు వైద్యం పనికిరాదు. నాటు వైద్యం ప్రాణాలకే ప్రమాదం. పాము కాటుకు అన్ని పభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంటాయి. పాము కాటుకు గురైన వ్యక్తి శరీరంలో మార్పులు రాకుండా చూసుకోవాలి.

– దిలీప్‌కుమార్, మెడికల్ ఆఫీసర్, దర్శనమల పీహెచ్‌సీ

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

కదిరి టౌన్: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ప్యానల్ చైర్‌పర్సన్ పి.హరిణి అధికారులను ఆదేశించారు. కదిరి మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రూ.20,26,71,071 బడ్జెట్‌కు కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. 4వ వార్డు కౌన్సిలర్ లింగాల కృపాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలోని సీఆర్‌సీ క్లబ్ మరమ్మతులకు రూ.9,83,000 ఎందుకు ఖర్చు చేశారని ప్రశ్నించారు. అది ప్రవేట్ క్లబ్ అని మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. 24 వార్డులోని మదనపల్లి బైపాస్ రోడ్డులో డాక్టర్ ప్రసాద్ క్లినిక్‌కు ఆనుకుని నిర్మించిన భవనాలను తొలగించాలని కౌన్సిలర్ ముస్తఫా కోరారు. కమిషనర్ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం పరిశీలిస్తామన్నారు. 22వ వార్డు కౌన్సిలర్ కూరగాయల ఇస్మాయిల్ మాట్లాడుతూ.. వార్డులో 5 రోజులైనా తాగునీరు రావడం లేదని తెలిపారు. ఎండకాలంలో కూడా తాగునీరు రాకపోతే ఎలా అని కమిషనర్‌ను ప్రశ్నించారు. తమ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్లు కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, సీఏ వి.నారాయణరెడ్డి, మున్సిపల్ అధికారులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెడ్డి సామాజిక వర్గ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న రిటైర్డ్ కలెక్టర్ కె.వి.రమణారెడ్డి

కదిరి: రెడ్డి సామాజిక వర్గ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తిరుపతి రిటైర్డ్ కలెక్టర్ కడపల వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక రెడ్డి భవన్‌లో మంగళవారం రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రూ.12 కోట్ల అంచనా వ్యయంతో కదిరిలో నిర్మించ తలపెట్టిన రెడ్డి కళ్యాణ మండపానికి నిధుల సేకరణ ఒక ప్రణాళికాబద్ధంగా జరగాలన్నారు. ముందుగా తాలూకా పరిధిలో రెడ్డి సంక్షేమ సంఘం మండల కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. రెడ్డి సంక్షేమ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారం అందిస్తానని విశ్రాంత న్యాయమూర్తి రెడ్డెప్ప రెడ్డి తెలిపారు. రెడ్డి సంక్షేమ సంఘం ద్వారా ఎన్నో సామాజిక కార్యక్రమాలకు నడుం బిగిద్దామని.. ఇందుకు అందరూ కలిసి రావాలని కమర్షియల్ ట్యాక్స్ రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ దేవరింటి భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రెడ్డి సామాజిక వర్గ సభ్యులందరూ తరచుగా సమావేశమవుతూ సంఘం అభివృద్ధిపై చర్చించుకుందామని మాజీ మున్సిపల్ చైర్మెన్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకు మునుపు కళ్యాణ మండప నిర్మాణం కోసం పెద్ద మొత్తంలో విరాళాలు అందజేసిన వారి పేర్లను చదివి వినిపించారు. సమావేశంలో కదిరి డివిజన్ పరిధిలోని 12 మండలాల రెడ్డి సామాజిక వర్గం వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



రెండో రోజు రిలేదీక్షలు నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూ ఉద్యోగులు



ధర్మవరంలో దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న యూనియన్ నాయకులు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయూ) నాయకులు మంగళవారం రెండవ రోజు డిపో ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గతంలో ఉన్నతాధికారులకు యూనియన్ తరపున వినతిపత్రాలు అందజేశామన్నారు. అయితే సమస్యలు పరిష్కరించడంలో ఆర్టీసీ యజమాన్యం విఫలమైందన్నారు. ఉద్యోగ భద్రత గురించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని కేటగిరీల్లో పదోన్నతులు కల్పించి ఖాళీలు భర్తీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రీజనల్ ఉపాధ్యక్షుడు రవితేజ, డిపో ప్రసిడెంట్ శివశంకర్, గ్యారేజీ ప్రెసిడెంట్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: ధర్మవరం డిపో వద్ద మంగళవారం డిపో సెక్రటరీ కె.మధుసూదన్ ఆధ్వర్యంలో రెండవ రోజు కూడా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. డిపో చైర్మన్ హనుమాన్, డిపో ప్రసిడెంట్ ప్రభాకర్, వర్కింగ్ ప్రసిడెంట్ ఎంఎం. రత్నం, సీనియర్ నాయకులు నారాయణస్వామి దీక్షల్లో కూర్చొన్నారు. వీరికి కడప జోనల్ కార్యదర్శి ఎం.చెన్నారెడ్డి సత్యసాయి జిల్లా రీజనల్ అధ్యక్షుడు శ్రీరామ్ నాయక్, రీజనల్ కార్యదర్శి షబ్బీర్, రీజినల్ జాయింట్ సెక్రెటరీ రవి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ నాయకులు ఎస్ఎం సాబ్, మోహన్, దుర్గాప్రసాద్, నాగప్ప, కుమార్, వైవీఎస్ రెడ్డి, పీఎస్ ఖాన్, మాధవ, ఎంసీజీ రావు, ఈఎం నాయక్, మంజునాథ్, భాస్కర్ పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

కదిరి అర్బన్: సమస్యలు పరిష్కరించక పోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేయాలని డిపో గ్యారేజీ ముందు చేపట్టిన రిలే దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. కొత్త బస్సులు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, గంగిరెడ్డి, శ్రీనివాసులు, జిలాన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



సాక్షి విలేకరి మదన్‌మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట



బీరే నారాయణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ, బుక్కపట్నం మండలంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పర్యటించారు. ఎనుములపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బీరే నారాయణ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. చాకలి వెంకటేష్, మంగళ రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పుట్టపర్తి సాక్షి రూరల్ రిపోర్టర్ ఎద్దుల మదన్‌మోహన్ రెడ్డి, సాక్షి సర్క్యులేషన్ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న రెడ్డివారి మధసూదన్ ‌రెడ్డిని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సత్యసాయి సూపర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లికి చెందిన రవి ప్రసాద్ రెడ్డిని పరామర్శించారు. అధైర్యపడాల్సిన అవసరం లేదని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నల్లమాడ మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన నరసింహా రెడ్డి భార్య చెన్నమ్మ, బుక్కపట్నం మండలం క్రిష్టాపురం గ్రామానికి చెందిన నారాయణ స్వామి భార్య వెంకటలక్ష్మమ్మ సత్యసాయి సూపర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మాజీ ఎమ్మెల్యే వీరిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగాఓబుళపతి, పట్టణ కన్వీనర్ రవినాయక్ మాజీ కన్వీనర్లు మాధవరెడ్డి, రంగారెడ్డి, గంగాద్రి, కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణ రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, మారెప్ప, ప్రసాద్‌రెడ్డి, ఓబుళరెడ్డి, బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీటీ సంస్థను కాపాడుకుందాం



కదిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కదిరి టౌన్: పేదల కోసం పని చేస్తున్న ఆర్డీటీ సంస్థను అందరు కలసి కాపాడుకుందామని బహుజన ప్రజా పరిరక్షణ సేవాసమితి అధ్యక్షుడు కేఆర్ హరిప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వికలాంగుల భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆర్డీటీ సంస్థను సంరక్షించుకోవడం ద్వారా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. హ్యూమన్స్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి జాకీర్ హుస్సేన్, వేణుగోపాల్, సూర్యనారాయణ, దిల్షాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయం: ఆర్డీటీ సేవలను జిల్లా ప్రజలకు దూరం చేసేలా కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏను రద్దు చేయడం దారుణం. వెంటనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని సేవలు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరారు. మంగళశారం జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి అంజి, కొత్తచెరువు మండల కార్యదర్శి ముత్యాలప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు కొనసాగించాలి

తనకల్లు: జిల్లాలో ఆర్డీటీ సేవలను కొనసాగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఆర్డీటీ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. పేదల పెన్నిధిగా పేరుగాంచిన ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్డీటీ సేవలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు పాలిసెట్ ప్రవేశ పరీక్ష

ధర్మవరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు బుధవారం పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మట్టి పరీక్షలు తప్పనిసరి

పుట్టపర్తి అర్బన్: పంటలు సాగు చేసే పొలాలకు మట్టి పరీక్షలు ఎంతో అవసరమని కొత్తచెరువు మండల వ్యవసాయాధికారి నటరాజ్ పేర్కొన్నారు. మంగళవారం కొత్తచెరువు మండలం కొడపగానిపల్లి గ్రామంలో మట్టి పరీక్షలపై రైతులకు తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలసి అవగాహన కల్పించారు. మట్టి నమూనాల అనంతరం హెల్త్‌కార్డులు అందించారు.

18న ఉచిత సామూహిక వివాహాలు

చెన్నేకొత్తపల్లి: నిరుపేద కుటుంబాలకు పెళ్లి భారం కాకుండా మే నెల 18వ తేదీన మండల పరిధిలోని బసంపల్లి గ్రామ సమీపంలోని కై వారం అమరనారేయణస్వామి, సద్గురు యోగి నారేయణ మఠంలో ఉచిత సామూహిక వివాహాలు చేస్తున్నారు. దాతల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వివాహాలు చేసుకోదల్చిన వారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. వధువు వయస్సు 18, వరుడి వయస్సు 21 సంవత్సరాలు పూర్తి అయి ఉండాలని, ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు.

క్లుప్తంగా

పకడ్బందీగా రీ సర్వే



భూముల రీసర్వేపై శిక్షణ ఇస్తున్న అధికారులు

ధర్మవరం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ మహేష్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు రీ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రీ సర్వేలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. సిబ్బంది లేవనెత్తిన సమస్యలకు అధికారులు పరిష్కారం చూపారు. ఎటువంటి సమస్యలు తలెత్తినా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విహార యాత్రలో విద్యార్థులు



విశ్వేశ్వరయ్య మ్యూజియంను సందర్శించిన విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 182 మంది విద్యార్థులను విజ్ఞాన విహార యాత్రకు తీసుకెళ్లారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు 30 మంది ఎస్కార్ట్ టీచర్లు బెంగళూరులోని విశ్వేరయ్య మ్యూజియం, ఫిష్ అక్వేరియం, ఇషా ఫౌండేషన్‌ను సందర్శించారు. అక్కడి విశేషాలను కూలంకషంగా వివరించారు. ఈ విహార యాత్రలతో శాస్త్రీయ నైపుణ్యాలు, భవిష్యత్తు పరిశోధన, మేక్ ఇన్ ఇండియా నినాదాన్ని సాకారం చేస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సదాశివయ్య, ఈర్షాద్ వలి, రాజరత్నం, ప్రవీణ్‌కుమార్, ప్రసాద్, నాగరాజవర్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత ఖత్నా




సరుకులు పంపిణీ చేస్తున్న ఫకృద్దీన్

ఓడీచెరువు: మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాలలో మంగళవారం 35 మంది ముస్లిం పిల్లలకు ఉచితంగా ఖత్నా చేశారు. కులమతాలకు అతీతంగా ఒడుగులు (ఖత్నా) చేయించుకోవచ్చని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ మారగాని కుంట్ల ఫకృద్దీన్ తెలిపారు. అనంతరం ఒడుగులు చేయించుకున్న వారికి నిత్యావసర సరుకులు, మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఖాజా, నిజాంవలి, సాదిక్, అబ్బులు హుస్సేన్, ఆరిఫ్, షాను తదితరులు పాల్గొన్నారు.

చిరుత సంచారం అవాస్తవం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని మల్లేనిపల్లి గ్రామ సమీపంలో చిరుత సంచరిస్తున్నట్లు మంగళవారం వివిధ వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే వార్తల్లో వాస్తవం లేదని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అక్కులప్ప తెలిపారు. చిరుత కుక్కను చంపిందని వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడం జరిగిందన్నారు. ఇదంతా అవాస్తవమని పేర్కొన్నారు. తాము క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించామన్నారు. కనీసం అక్కడ చిరుత పులి సంచరించినట్లు పాదాల గుర్తులు కూడా లేవని స్పష్టం చేశారు, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు.

బీమాతో ఆర్థిక భరోసా



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకట రంగారావు

తాడిమర్రి: ఉపాధిహామీ పనులను నాణ్యతగా గిట్టుబాటు కూలి లభించేలా చేయాలని ఎంపీడీఓ వెంకట రంగారావు కూలీలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రానికి సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనికి తగ్గట్టు వేతనం రోజు వారి కూలీ రూ.307 పడేలా ఇచ్చిన కొలతల మేరకు పని చేయాలన్నారు. అలాగే పనికి రాని వారి పేర్లను నమోదు చేస్తే ఆ గ్రూపులోని మేట్‌పైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఖాతాలు ఉన్న బ్యాంకుల్లో పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై బీమా చేయించుకోవాలని సూచించారు. అతి తక్కువ మొత్తంతో చేసుకునే ఈ బీమా పాలసీలతో ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. పాలసీదారులు ప్రమాదవశాత్తూ మృతి చెందితే పెద్ద మొత్తంలో బీమా అందుతుందన్నారు. బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి, ఈసీ సాయికృష్ణ, టీఏలు పుణ్యవతి, భారతి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తనకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పూల రెడ్డెప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

జ్యోతుల ఊరేగింపు

ఓడీచెరువు: మండల పరిధిలోని లింగాలవారిపల్లిలో మంగళవారం మారెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అనంతరం జ్యోతులు, బోనాలు ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మార్కెట్‌యార్డు డైరెక్టర్‌గా మంజునాథ్

కనగానపల్లి: రాప్తాడు మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా కనగానపల్లికి చెందిన అంకె మంజునాథ్‌ను నియమించారు. ప్రస్తుతం మంజునాథ్ జనసేన యూత్ విభాగంలో పనిచేస్తున్నారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ తన ఎంపికకు సహకరించిన రాప్తాడు నియోజవర్గ జనసేన, టీడీపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

4న ఉచిత కంటి వైద్య శిబిరం

ధర్మవరం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మే 4వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. మంగళవారం స్వాతి క్లినిక్‌లో వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి (బెంగళూరు వెస్ట్ లయన్స్ సూపర్ స్పెషాలిటి కంటి ఆసుపత్రి) యువర్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం జరగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రసిడెంట్ శీలా నాగేంద్ర, వైస్ ప్రెసిడెంట్ సుంకు సుకుమార్, సెక్రటరీ జయరాం, కోశాధికారి వంకదారి మోహన్, పీఆర్‌ఓ రాధాకృష్ణ, పోలా ప్రభాకర్, బీవీ సుబ్బారావు, కోటేశ్వరరావు, చాంద్‌బాషా, కేతా లోకేష్, జయంతి, వినోద్ కుమార్ సభ్యులు పాల్గొన్నారు.

మండల సమావేశం నేటికి వాయిదా

అమడగూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం సభ్యులు లేక బుధవారానికి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ మునెప్ప ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 8 మంది ఎంపీటీసీలు, ఒక కో-ఆప్షన్ మెంబర్ ఉండగా సమావేశం నిర్వహణకు నిబంధనల ప్రకారం 5 మంది ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సి ఉంది. అయితే కేవలం ఇద్దరు మాత్రమే హాజరుకావడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు ప్రకటించారు. కాగా బుధవారం నిర్వహించే మండల మీట్‌కు కూడా ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో సమస్యలు తెలియజేస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోకపోగా.. కనీసం తాము ప్రజాప్రతినిధులమనే మర్యాద కూడా ఇవ్వకపోతే మీటింగ్‌కు ఎలా వెళ్లాలని పలువురు ఎంపీటీసీలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో అధికారులు సమస్యలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

తలుపుల: గర్భవతులు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ రాధిక సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ రామానాయక్‌తో కలిసి పౌష్టికాహార పక్షోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. గర్భిణులు కూడా తాజా కూరగాయలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దీప, అలివేలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: పరిపూర్ణ ఆరోగ్యానికి సంపూర్ణ పోషణే ముఖ్యమని సీడీపీఓ గాయత్రి పేర్కొన్నారు. పెడపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. మొదట గ్రామంలో ర్యాలీ నిర్వహించి పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సప్పలమ్మకు బోనాలు



బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ముష్టికోవెల గ్రామ పంచాయతీ పరిధిలోని సుబ్బరాయనిపల్లిలో వెలసిన సప్పలమ్మకు మంగళవారం గ్రామస్తులు బోనాలు సమర్పించి పూజలు చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో సప్పలమ్మదేవిని ప్రతిష్టించారు. 41 రోజుల అనంతరం గ్రామపెద్దల ఆధ్వర్యంలో జాతర జరుపుకున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలు తీసుకుని ఊరేగింపుగా దేవాలయం వద్దకు చేరుకొని అమ్మవారికి సమర్పించారు.